# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 329 | సోమవారం 5 ఆగస్టు 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# పెట్టుబడులే లక్ష్యంగా..



- అమెరికాలో బిజీబిజీగా సీఎం రేవంత్ టీమ్
- అమెరికాలో పలు కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు
- న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో పర్యటన
- ఐటీ కంపెనీల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొననున్న సీఎం రేవంత్

హైదరాబాద్

అమెరికాలోని న్యూయార్క్‌లో సీఎం రేవంత్ బృందానికి ప్రవాస భారతీయులు ఘనస్వాగతం పలికారు. న్యూయార్క్‌లో జరగబోయే కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొనబోతున్నారు. 11రోజుల పర్యటనలో భాగంగా అమెరికాలోని పలు నగరాలు సహా దక్షిణ కొరియాలోని సియోల్‌ను సీఎం రేవంత్ రెడ్డి బృందం పర్యటించనుంది. ఆగస్టు 14 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. ఎనిమిది రోజులు అమెరికాలో, రెండు రోజులు దక్షిణ కొరియాలో రేవంత్ రెడ్డి అండ్ టీమ్ పర్యటించబోతోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు - మిగతా3లో



## వక్ఫ్ బోర్డ్ స్వయం ప్రతిపత్తిని తొలగించేందుకు మోదీ సర్కార్ కుయుక్తులు

- ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ
- వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని తొలగించి దాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకోవాలి
- వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని కేంద్రం భావిస్తున్నది
- బీజేపీ తొలి నుంచీ ఈ బోర్డులకు, వక్ఫ్ ఆస్తులకు వ్యతిరేకమని, కాషాయ పాలకులు హిందుత్వ అజెండాపై పనిచేస్తున్నారు




## లాలూ, నితీష్, బీజేపీ నుంచి బిహారీలకు విముక్తి

- జన్ సురాజ్ పార్టీ ఏర్పాటుపై ప్రశాంత్ కిషోర్
- 30 ఏండ్ల లాలూ, నితీష్, బీజేపీల పాలనకు పాతరేసేందుకు నూతన పార్టీతో ముందుకొస్తారు
- ఈ పార్టీల నుంచి బిహారీలకు విముక్తి ప్రసాదించడమే జన్ సురాజ్ లక్ష్యం
- అక్టోబర్ 2న జన్ సురాజ్ ఆవిర్భవించనుంది.



## తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్తు ఉంది

- బీజేపీ నేతలు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలి
- పార్టీ బలహీనంగా ఉన్న చోట మరింత కష్టపడి పనిచేయాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలపై పోరాటం చేయాలి
- ప్రజలకు అండగా ఉండాలి
- త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించాలి

హైదరాబాద్

తెలంగాణలో తమ పార్టీకి మంచి భవిష్యత్తు ఉందని బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ వ్యాఖ్యానించారు. ఆదివారం నాడు బీజేపీ కార్యాలయానికి బీఎల్ సంతోష్ వచ్చారు. పార్టీ ప్రధాన కార్యదర్శులతో బీజేపీ అగ్రనేత సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కమలం నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో బీఎల్ సంతోష్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై - మిగతా3లో

# ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు
- ధరణి పేరుతో దాదాపు రూ.2 లక్షల కోట్ల స్కాం జరిగింది
- దేశంలోనే అతిపెద్ద స్కాం ధరణి
- కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తూ వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధమయ్యారు
- బోనాల పండుగ వెనుక పెద్ద చరిత్ర ఉంది
- బోనం పండుగకు సైంటిఫిక్ రీజన్ కూడా ఉంది

హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం 'ఫోర్త్ సిటీ' పేరుతో చేసిన ప్రకటన వెనుక పెద్ద ఎత్తున భూ దందా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ నేతలు వేల ఎకరాలను ముందుగానే సేకరించి... రియల్ ఎస్టేట్ దందా చేస్తూ వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఆదివారం నాడు మహేశ్వరం నియోజకవర్గంలోని గుర్రంగూడలో బోనాల ఉత్సవాలకు బండి సంజయ్ కుమార్, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార - మిగతా3లో



## 2029లోనూ మేమే వస్తాం

- మీరు అక్కడే ఉంటారు
- విపక్షాలకు అమిత్ షా కౌంటర్
- ఎన్డీయే సంఖ్యాబలంపై విపక్షాల విమర్శలు
- ఎన్డీయే కూటమి ఐదేళ్లు పూర్తి చేసుకుంటుందని అమిత్ షా స్పష్టీకరణ
- మళ్లీ విపక్షంలో కూర్చునేందుకు సిద్ధంగా ఉండండి అంటూ వ్యాఖ్యలు

# నాకు, బీఆర్ఎస్ పార్టీకి 'తెలంగాణ ఫస్ట్'

- సీఎం అమెరికా పర్యటనపై కేటీఆర్ ట్వీట్
- విదేశీ పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి టీమ్ అమెరికా, దక్షిణ కొరియా పర్యటనకు
- 'పదేళ్లపాటు అధికారంలో ఉన్న తాము విదేశాల్లోని ప్రముఖ కంపెనీలతో పెంచుకున్న సంబంధాలు ఇప్పుడు రాష్ట్రానికి మేలు చేకూరుస్తున్నాయి.
- టీఎస్ ఐపాస్‌లో ప్రభుత్వ వినూత్నమైన విధానాలకు ఆకర్షితులై చాలా సంస్థలు రాష్ట్రంలో గణనీయంగా పెట్టుబడులు పెట్టాయి.



హైదరాబాద్

తెలంగాణకు మరిన్ని విదేశీ పెట్టుబడులు తెచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి టీమ్ అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు వెళ్లింది. ఈ క్రమంలో తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం నుంచి భారీ బృందం అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు వెళ్తున్నది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి, మంత్రి శ్రీధర్‌బాబుకు నా శుభాకాంక్షలు. ఆల్ ది బెస్ట్.' అంటూ కేటీఆర్ - మిగతా3లో



## ఉప్పల్ ఫ్లై ఓవర్ విషయంలో కేసీఆర్ సిగ్గుపడాలి

- రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి హైదరాబాద్ విశ్వనగరం చేస్తున్నామని అన్నారు
- కానీ 6 ఏళ్లు అయిన ఉప్పల్ ఫ్లైఓవర్ ఎందుకు పూర్తి చేయలేదు
- ఉప్పల్ ఫ్లైఓవర్‌పై గతంలో రేవంత్ రెడ్డి పార్లమెంట్‌లో 10 సార్లు అడిగారు

# విద్య వైద్యకు ప్రభుత్వం పెద్ద పీట

- రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం చేపట్టింది
- ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తరువాత పేదలు, రైతుల పక్షపాతిగా ఉంది
- ధరణి వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు
- ఆనాడు గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఆ పార్టీ నేతలు ధరణిపై అబద్ధాలు చెపుతున్నారు



ఖమ్మం

నేలకొండపల్లి మండలం, గువ్వలగూడెంలో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటిస్తున్నారు. ఈ సందర్భగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి నూతనంగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్‌ను ప్రారంభించారు అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విద్య వైద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం చేపట్టిందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తరువాత పేదలు, రైతుల పక్షపాతిగా ఉందని, 31 వేల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేస్తుందన్నారు. ధరణి వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆనాడు గొప్పలు చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఆ పార్టీ నేతలు - మిగతా3లో

Bharatiya Janata Party

## తమిళనాడు బీజేపీలో పెను మార్పులు

- 20 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల మార్పు?
- అన్నామలై సంచలన నిర్ణయం
- ఆ పార్టీకి ఉన్న 66 మంది జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చాలని ఆయన భావిస్తున్నారు.

# 2029లోనూ మేమే వస్తాం

న్యూఢిల్లీ: ఈ ఏడాది మే నెలలోనే లోక్‌సభ ఎన్నికలు-2024 జరిగాయి. ఎన్డీయే కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. విపక్షాలు గతంతో పోల్చితే పుంజుకున్నప్పటికీ ప్రతిపక్ష పాత్రకే పరిమితమవ్వాల్సి వచ్చింది. ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండు నెలల పూర్తికావొస్తోంది. అయితే 2029లో జరగబోయే 2029 లోక్‌సభ ఎన్నికల్లో కూడా నరేంద్ర మోదీ దేశానికి నాలుగోసారి దేశ ప్రధాని అవుతారని, ఇక విపక్ష ఇండియా కూటమి ప్రతిపక్షంలోనే కూర్చుంటుందని జోస్యం చెప్పారు. చండీగఢ్‌లో నీటి సరఫరా ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లోనూ ఎన్డీయే కూటమి గెలుస్తుందని, ఇండియా కూటమి విపక్షంలోనే కూర్చుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. చండీగఢ్ లో మణిమజ్ర 24ఐ7 నీటి సరఫరా ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో అమిత్ షా ప్రసంగిస్తూ... 2029లోనూ మేమే అధికారంలోకి వస్తాం... మీరు మళ్లీ విపక్షంలోనే ఉండడానికి సిద్ధంగా ఉండండి అని వ్యాఖ్యానించారు.



గత ఎన్నికలతో పోల్చితే ఇటీవలి ఎన్నికల్లో ఎన్డీయే బలం తగ్గడంపై విపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలకు అమిత్ షా పైవిధంగా బదులిచ్చారు. "కొన్ని సీట్లు వచ్చినందుకే గెలిచినట్టు భావించుకుంటున్నారు. గత మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎన్ని సీట్లు వచ్చాయో... అంతకంటే ఎక్కువ సీట్లను బీజేపీ ఇటీవల ఎన్నికల్లో గెలుచుకుందన్న విషయం గుర్తించాలి. ప్రతిపక్ష కూటమి సాధించిన సీట్ల కంటే, ఎన్డీయే కూటమిలోని ఒక పార్టీ (బీజేపీ) సాధించిన సీట్లే ఎక్కువ అని వారికి తెలియడంలేదు. ప్రతిపక్షాలకు చెందిన మిత్రులకు ఓ విషయం చెబుతున్నాను... ఎన్డీయే సర్కారు ఐదేళ్లు పూర్తి చేసుకోవడమే కాదు... మళ్లీ అధికారంలోకి వస్తుంది. అందుకే విపక్షంలో ఉంటూ సమర్థంగా ఎలా పనిచేయాలో నేర్చుకోండి" అంటూ అమిత్ షా హితవు పలికారు. అంతేకాదు, ప్రతిపక్షాలు ఏదో మాట్లాడుతుంటాయి, అనిశ్చితి సృష్టించాలన్నదే ఆ పార్టీల ప్రయత్నం... మీరు ఆందోళన చెందవద్దు అంటూ బీజేపీ శ్రేణులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ప్రతిపక్ష పార్టీలు ఏం చెప్పాదలుచుకున్నా ఆందోళన చెందవద్దంటా బహిరంగ సమావేశానికి హాజరైన కార్యకర్తలకు ఆయన భరోసా ఇచ్చారు. 2029లో కూడా ఎన్డీయే అధికారంలోకి వస్తుందని, నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని అవుతారని అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్షాల సీట్లు పెరగడంపై మాట్లాడుతూ.. 'కొంత విజయంతో' ఎన్నికల్లో గెలిచినట్టు భావిస్తున్నారని, కాంగ్రెస్ కంటే బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకుందని ఆయన ప్రస్తావించారు. గత మూడు ఎన్నికల్లోనూ బీజేపీనే అత్యధిక సీట్లు దక్కించుకుందని పేర్కొన్నారు. "కొంత విజయంతో మేము ఎన్నికల్లో విజయం సాధించేశామని వారు (ప్రతిపక్షాలు) భావిస్తున్నారు. గత మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే బీజేపీకి ఎక్కువ సీట్లు వచ్చాయని వారికి తెలియదు" అని అమిత్ షా విమర్శించారు. అనిశ్చితిని సృష్టించాలని భావిస్తున్న వ్యక్తులు ప్రభుత్వం నడవదంటూ పదే పదే వ్యాఖ్యానిస్తున్నారని విమర్శంచారు.

**ప్రతిపక్షాలకు అమిత్ షా సూచన ఇదే..**

ప్రతిపక్షంలో ఉండి సమర్థవంతంగా పని చేయడం నేర్చుకోండంటూ విపక్షాల ఇండియా కూటమికి అమిత్ షా సలహా ఇచ్చారు. తమ ప్రభుత్వం ఐదేళ్ల అధికారాన్ని పూర్తి చేసుకుంటుందని, తదుపరి అధికారం కూడా తమదేనని ప్రతిపక్ష మిత్రులకు చెప్పాలనుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధంగా ఉండాలని, ప్రతిపక్షంలో సమర్థవంతంగా పనిచేయడం నేర్చుకోండంటూ ఆయన వ్యాఖ్యానించారు. కాగా లోక్‌సభ ఎన్నికలు -2024లో బీజేపీ 240 సీట్లు గెలుచుకుంది. 2019లో ఒంటరిగా 303 సీట్లు సాధించిన ఆ పార్టీ ఈసారి గణనీయ సంఖ్యలో స్థానాలను కోల్పోయింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ప్రధానంగా జేడీయూ, టీడీపీ మిత్రపక్షాలపై ఆధారపడింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో అంచనాలకు మించి 99 స్థానాలు దక్కించుకుంది. 2019లో 52 స్థానాలకే పరిమితమవ్వగా ఈసారి గణనీయంగా పుంచుకుంది.

## వక్ఫ్ బోర్డ్ స్వయం ప్రతిపత్తిని తొలగించేందుకు మోదీ సర్కార్ కుయుక్తులు




వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న వార్తలపై ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని తొలగించి దాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకోవాలని మోదీ సర్కార్ యోచిస్తోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని కేంద్రం భావిస్తున్నదని అన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఔన్నత్యం, హక్కులకు భిన్నంగా పార్లమెంట్‌లో వెల్లడించని విషయాలపై మీడియాకు సమాచారం అందిస్తున్నదని ఓవైసీ మండిపడ్డారు. మీడియా కథనాల ప్రకారం వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం తొలగించాలని యోచిస్తోందని వెల్లడవుతున్నదని చెప్పారు. బీజేపీ తొలి నుంచీ ఈ బోర్డులకు, వక్ఫ్ ఆస్తులకు వ్యతిరేకమని, కాషాయ పాలకులు హిందుత్వ అజెండాపై పనిచేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టానికి సవరణలు చేపడితే నిర్వహణ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని వక్ఫ్ బోర్డు ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతింటుందని పేర్కొన్నారు. వివాదాస్పద ఆస్తులు ఏమైనా ఉంటే బీజేపీ పాలకులు, సీఎంలు వాటిపై సర్వే చేయిస్తామని చెబుతారని, ఆపై వీరి సర్వే ఎటు దారితీస్తుందనేది తెలిసిన విషయమేనని పేర్కొన్నారు. దేశంలో ఎన్నో దర్గాలు అసలు దర్గాలు, మసీదులు కాదని బీజేపీ-ఆరెస్సెస్ చెబుతున్నాయని అన్నారు. న్యాయవ్యవస్థ అధికారాలను కార్యనిర్వాహకవర్గం లాగేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఓవైసీ దుయ్యబట్టారు. కాగా, వక్ఫ్ చట్టానికి సవరణలు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని వార్తలు వెల్లడయ్యాయి. కాగా, రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ చట్టానికి దాదాపు 40 సవరస్త్రణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్నదని చెబుతున్నారు.

## తమిళనాడు బీజేపీలో పెను మార్పులు




**చెన్నై:** తమిళనాడు భారతీయ జనతా పార్టీలో పెను మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చేందుకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై నిర్ణయించారు. ఇటీవల ఆయన ఢిల్లీకి వెళ్ళిన ఆయన... అక్కడ పార్టీ పెద్దలతో వివిధ అంశాలతో పాటు పార్టీ బలోపేతంపై సుధీర్ఘంగా చర్చించి, మళ్ళీ రాష్ట్రానికి చేరుకున్నారు. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఇందులోభాగంగా ఆ పార్టీకి ఉన్న 66 మంది జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చాలని ఆయన భావిస్తున్నారు. కాగా, ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసిన స్థానాల్లో ఒక సీటులో కూడా గెలవలేదు. కానీ, 12 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవాలన్న తలంపులో ఆయన ఉన్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సంసిద్ధులను చేయనున్నారు.

## లాలూ, నితీష్, బీజేపీ నుంచి బిహారీలకు విముక్తి




జన్ సురాజ్ మిషన్‌పై ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 2న ప్రశాంత్ కిషోర్ రాజకీయ పార్టీని స్థాపించడం లేదని, కోటి మంది బిహార్ ప్రజలు తమ పిల్లల భవితవ్యం కోసం, 30 ఏండ్ల లాలూ, నితీష్, బీజేపీల పాలనకు పాతరేసేందుకు నూతన పార్టీతో ముందుకొస్తారని స్పష్టం చేశారు. ఈ పార్టీల నుంచి బిహారీలకు విముక్తి ప్రసాదించడమే జన్ సురాజ్ లక్ష్యమని తెలిపారు. ప్రశాంత్ కిషోర్ పాత్ర గతంలో మాదిరే ఉంటుందని చెప్పారు. కోటి మంది బిహారీలు పార్టీ ఏర్పాటు చేసేందుకు ఏకమవడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. కాగా, ప్రముఖ రాజకీయ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ 'జన్ సురాజ్ అభియాన్' రాజకీయ పార్టీగా మారేందుకు ముహూర్తం ఖరారైంది. అక్టోబర్ 2న జన్ సురాజ్ ఆవిర్భవించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదక సాగుతున్నాయి. పార్టీ ఏర్పాటు దిశగా ఎనిమిది రాష్ట్ర స్థాయి సమావేశాలను జన్ సురాజ్ నిర్వహించనుంది. ఈ సమావేశాల తేదీల వివరాలు కూడా త్వరలో ఖరారు కానున్నాయి. బీహార్ వ్యాప్తంగా 1.5 లక్షల మందిని సమీకరించాలని ప్రశాంత్ కిషోర్ సారధ్యంలోని జన్ సురాజ్ నిర్ణయించింది.

## ఆక్రమణలు తొలగించిన మహిళా అధికారిణి.. బెదిరించిన మంత్రి




**కోల్‌కతా:** ఆక్రమణలు తొలగించిన మహిళా అధికారిణిని మంత్రి బెదిరించారు. పేదల షాపులు తొలగింపుపై ఆమెను దుర్భాషలాడారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆ మంత్రిపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బా మేదినీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తాజ్‌పూర్‌లోని సముద్ర తీరానికి సమీపంలోని అటవీ శాఖ భూమిలో కొన్ని షాపులను అక్రమంగా ఏర్పాటు చేశారు. సముద్రానికి చాలా దగ్గరగా, ప్రమాదకర స్థితిలో ఉన్న అక్రమ షాపులను శుక్రవారం రాత్రి తొలగించారు. కాగా, ఆ వ్యాపారుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి అఖిల్ గిరి, శనివారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమ షాపులను తొలగించడంపై మహిళా ఫారెస్ట్ రేంజర్ మనీషా సాహుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా అక్రమ నిర్మాణాలను వదిలేసి పేదలకు చెందిన షాపులను మాత్రమే తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా మహిళా అధికారిణిని దుర్భాషలాడటంతోపాటు బెదిరించారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బెంగాల్ బీజేపీ దీనిని ఎక్స్‌లో షేర్ చేసింది. మహిళా అధికారిణిని తిట్టడంతోపాటు బెదిరించిన మంత్రి అఖిల్ గిరిపై సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అని ప్రశ్నించింది. ఆయనను అరెస్ట్ చేసి జైలులో పెట్టాలని డిమాండ్ చేసింది.

## ఆలయం పక్కనున్న గోడ కూలి.. 9 మంది పిల్లలు మృతి



**భోపాల్:** ఆలయం పక్కనున్న గోడ కూలడంతో 9 మంది పిల్లలు మరణించారు. మరి కొందరు చిన్నారులు గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. షాపూర్‌లోని హర్దౌల్ బాబా దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు శివలింగాలు తయారు చేస్తుండగా ఆలయం పక్కనే ఉన్న పురాతన ఇంటి గోడ కూలింది. కాగా, ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు, అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో సహాయక కార్యక్రమాలు చేపట్టారు. జేసీబీతో గోడ శిథిలాలు తొలగించారు. ఈ సంఘటనలో 9 మంది పిల్లలు మరణించారు. మరి కొందరు చిన్నారులు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులంతా పది నుంచి 15 ఏళ్ల వయస్సున్న పిల్లలని అధికారులు తెలిపారు. ఆలయం పక్కనున్న ఇల్లు సుమారు 50 ఏళ్ల నాటిదని చెప్పారు. భారీ వర్షాల కారణంగా ఆ ఇంటి పురాతన గోడ కూలిందని వివరించారు. మరోవైపు ఈ సంఘటన తనకు బాధ కలిగించిందని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ తెలిపారు. పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.

## యామినీ కృష్ణమూర్తి ప్రావీణ్యం, అంకితభావం తరతరాలకు స్ఫూర్తిదాయకం: ప్రధాని నరేంద్ర మోదీ



నిన్న ఢిల్లీలో కన్నుమూసిన ప్రఖ్యాత నాట్యకారిణి యామినీ కృష్ణమూర్తి

ఆమె ఇక లేరన్న వార్త తెలిసి ఎంతో బాధపడ్డానన్న ప్రధాని మోదీ

దేశ సాంస్కృతిక యవనికపై చెరగని ముద్రవేశారని వెల్లడి

దేశం గర్వించదగ్గ నాట్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి నిన్న సాయంత్రం ఢిల్లీలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆమె మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. డాక్టర్ యామినీ కృష్ణమూర్తి తుదిశ్వాస విడిచారన్న వార్త తెలిసి ఎంతో బాధపడ్డానని వెల్లడించారు. భారత శాస్త్రీయ నృత్యంలో ఆమె ప్రావీణ్యం, కళపై ఆమెకున్న అంకితభావం తరతరాలకు స్ఫూర్తిదాయకం అని కీర్తించారు. దేశ సాంస్కృతిక యవనికపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. మన ఘనతర వారసత్వాన్ని మరింత సుసంపన్నం చేయడానికి అవిరళ కృషి చేశారని మోదీ వివరించారు. ఆమె కుటుం బానికి, అభిమానులకు సంతాపం తెలియజేసు కుంటున్నానని పేర్కొన్నారు.

## గవర్నర్ ఆ రాజ్యాంగానికి అనుగుణంగా విధులను నిర్వర్తించాలి



భారతదేశంలో గవర్నర్ల వ్యవస్థపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. గవర్నర్లు చేయాల్సిన పనులు కాకుండా చేయకూడని పనులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. క్రియాశీల పాత్ర పోషించాల్సి వచ్చినప్పుడు నిష్క్రియంగా ఉంటారని అన్నారు. సుప్రీంకోర్టులో గవర్నర్ల అంశంపై ప్రస్తుతం నడుస్తున్న కేసులు విచారకరం అని పేర్కొన్నారామె. తాజాగా బెంగళూరులో జరిగిన సదస్సులో పాల్గొన్న జస్టిస్ నాగరత్న కీలక అంశాలపై ప్రసంగించారు. గవర్నర్ల తటస్థత గురించి రాజ్యాంగ సభ చర్చలలో జి దుర్గాబాయి చేసిన వ్యాఖ్యలను ఉటంకించిన జస్టిస్ నాగరత్న.. 'గవర్నర్‌ను పార్టీ రాజకీయాలకు అతీతంగా, వర్గాలకు అతీతంగా ఉంచడమే పాలకవర్గం బాధ్యత. పార్టీ వ్యవహారాలకు లోబడి గవర్నర్ వ్యవస్థ ఉండకూడదు' అని అన్నారు.

గవర్నర్ల తీరుపై జస్టిస్ నాగరత్న ఆందోళన వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది మార్చిలో నల్సార్ యూనివర్సిటీలో చేసిన ఉపన్యాసంలోనూ ఆమె ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 'ఒక రాష్ట్రానికి సంబంధించి బిల్లులను ఆమోదించడంలో లేదా వాటిపై అభిప్రాయాన్ని తెలియజేయడంలో గవర్నర్లు ఆలస్యం వహిస్తున్నారని, నిర్లక్ష్యం వహిస్తున్నారనే వ్యాజ్యాలు కోర్టుల్లో అధికమవుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్.. ఆ రాజ్యాంగానికి అనుగుణంగా తమ విధులను నిర్వర్తించాలి. తద్వారా న్యాయస్థానాల్లో ఇలాంటి వ్యాజ్యాలు తగ్గుతాయి. రాజ్యాంగం ప్రకారం వారి విధులను వారు నిర్వర్తించాలని చెప్పే సమయం ఆసన్నమైంది' అని జస్టిస్ నాగరత్న అన్నారు. పలు రాష్ట్రాల శాసన సభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలిపేందుకు నిరాకరించడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ నాగరత్న చేసిన వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇటీవల కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు తమ గవర్నర్‌లు చాలా నెలలుగా బిల్లులకు ఆమోదం తెలుపడం లేదని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. వీటిని స్వీకరించిన ధర్మాసం.. నోటీసులు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌కు సంబంధించిన మరో పిటిషన్‌లో.. రాజ్యాంగం లోని ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్‌కు మినహాయింపు పరిధిని పరిశీలించడానికి కూడా సుప్రీంకోర్టు అంగీకరిం చింది. తెలంగాణ, పంజాబ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల గవర్నర్లు బిల్లులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని గతంలో సుప్రీంకోర్టు విమర్శించింది. ముఖ్యమంత్రి సిఫార్సు చేసినా మంత్రి పదవి ఇవ్వడానికి నిరాకరించినందుకు తమిళనాడు గవర్నర్‌పై కూడా సుప్రీంకోర్టు ఫైర్ అయింది.

## రాహుల్‌ని అరెస్ట్ చేస్తే దమ్ముందా.. బీజేపీకి సవాల్ విసిరిన కాంగ్రెస్ నేత



**ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఈడీ టార్గెట్ చేసిందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్న వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు బీజేపీకి సవాల్ విసిరారు. ఆ పార్టీ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఆదివారం ఢిల్లీలో మాట్లాడుతూ.. రాహుల్‌ని ఈడీ అధికారులు అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఆయన్ని అరెస్ట్ చేసే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు. అరెస్ట్ చేస్తే బీజేపీ శవపేటికకు అరెస్టే చివరి మేకు అవుతుందని హెచ్చరిం చారు. పార్లమెంటులో చక్రవ్యూహ ప్రసంగం తరువాత దర్యాప్తు సంస్థలు రాహుల్‌పై నిఘా పెట్టాయని ఆయన ఆరోపించారు.

**రాహుల్ ఏమన్నారంటే..**

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనపై దాడులు చేసేందుకు సిద్ధమవుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభలో 'చక్రవ్యూహం' అంటూ తాను చేసిన ప్రసంగం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదన్నారు. ఆ ప్రసంగం నేపథ్యంలో త్వరలోనే తనపై ఈడీ దాడులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. 'ఆ ఇద్దరిలో' ఒకరికి తన చక్రవ్యూహం ప్రసంగం నచ్చలేదని తెలుస్తోం దని, అందువల్లే తనపై దాడులకు సిద్ధమవుతున్నట్లు ఈడీలో పనిచేస్తున్న కొంతమంది తెలిపారని రాహుల్ పేర్కొన్నారు. 'ఈ దాడుల కోసం ఎదురుచూస్తున్నా. చాయ్, బిస్కట్లు సిద్ధంగా ఉంచండి' అని ఈడీ డైరెక్టరేట్ ఖాతాను ట్యాగ్ చేస్తూ రాహుల్ గాంధీ శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చలో భాగంగా సోమవారం లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని 'పద్మవ్యూహం'లోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాభారతంలోని కీలక ఘట్టమైన పద్మవ్యూహాన్ని, వీరమరణం పొందిన అభిమన్యుడిని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తదితరులపై విమర్శలు గుప్పించారు. అయితే, తనపై ఈడీ దాడులు జరగొచ్చన్న రాహుల్ గాంధీ ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. వయనాడ్ ఎంపీగా అక్కడ జరిగిన విషాద ఘటనకు బాధ్యత వహించాల్సి వస్తుందనే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తింది.

**చక్రవ్యూహ ప్రసంగం..**

జులై 29వ తేదీన కేంద్ర బడ్జెట్‌పై రాహుల్ గాంధీ సుధీర్ఘ ప్రసంగం చేశారు. మహాభారత కురుక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడిని ఆరుగురు వ్యక్తులు చక్రవ్యూహంలో బంధించి చంపారని, తాను కొంచెం పరిశోధన చేసి చక్రవ్యూహాన్ని కనిపెట్టినట్లు రాహుల్ చెప్పారు. చక్రవ్యూహాన్ని పద్మవ్యూహం అని కూడా అంటారు. '21వ శతాబ్దంలో ఒక కొత్త చక్రవ్యూహం ఏర్పడింది. అభిమన్యుడిలా దేశంలోని యువకులు, రైతులు, మహిళలు, చిన్న, మధ్యతరహా వ్యాపారులు ప్రస్తుతం ఆరుగురు వ్యక్తుల కారణంగా నలిగిపోతున్నారు. చక్రవ్యూహంలో ఆరుగురు వ్యక్తులు మోదీ, షా, మోహన్ భగవత్, అజిత్ ధోవల్, ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ' అని రాహుల్ పేర్కొన్నారు.

# ఫోర్త్ సిటీ వెనుక కాంగ్రెస్ భూదందా

-మొదటిపేజీ తరువాయి

ప్రతినిధి జె.సంగప్ప, రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో బండి సంజయ్ మాట్లాడుతూ... ధరణి పేరుతో దాదాపు రూ.2 లక్షల కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. దేశంలోనే అతిపెద్ద స్కాం ధరణి అని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ బాటలో నడుస్తూ వేల కోట్ల ఆస్తులను దోచుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు.

### హిందువుల పండుగలకు పైసలివ్వరు

"తెలంగాణ అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు... తమ ఆడబిడ్డలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు. బోనాల పండుగ వెనుక పెద్ద చరిత్ర ఉంది. బోనం పండుగకు సైంటిఫిక్ రీజన్ కూడా ఉంది. కానీ ఇంత పెద్ద పండుగకు ప్రభుత్వం నిధులివ్వదు. హిందువుల పండుగలకు పైసలివ్వరు. సెక్యులరిజం పేరుతో ఒక మతానికే కొమ్ముకాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తోంది. రంజాన్‌కు రూ.33 కోట్లు, హిందువులను చంపిన తబ్లిగీ జమాతే సంస్థకు రూ.2 కోట్ల 40 లక్షలు విడుదల చేసిన కాంగ్రెస్ అదేదో ఘన కార్యంగా చెప్పుకోవడం సిగ్గు చేటు. హిందువుల పండుగలంటే అంత చులకనా? బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ కూడా ఎంఐఎం పార్టీకి కొమ్ము కాస్తోంది" అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నాపై మతతత్వ ముద్ర..?

"ఎంఐఎం విషయాన్ని ఎత్తిచూపితే నాపై మతతత్వ ముద్ర వేయాలని చూస్తున్నారు. ఇలానే వ్యవహరిస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టడం ఖాయం. ఎంఐఎం పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్ నేతలు నట్టేటా మునగడం ఖాయం. 15 నిమిషాలపాటు సమయమిస్తే హిందువులను నరికి చంపుతానన్న మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీని తీసుకెళ్లి కొడంగల్‌లో పోటీ చేయిస్తామని కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించడం సిగ్గు చేటు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ వాస్తవాలు ఆలోచించాలి. నిరంతరం బీజేపీని విమర్శించడం మానుకోవాలి. కేంద్రంతో సమన్వయంతో వ్యవహరించాలి. తెలంగాణ అభివృద్ధికి మేం పూర్తిగా సహకరిస్తాం. కలిసికట్టుగా పనిచేసి నిధులు తీసుకువద్దాం. అంతే తప్ప ప్రధానమంత్రి నరేంద్రమోదీని అదేపనిగా విమర్శించడం నష్టమే తప్ప లాభం లేదనే అంశాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలి" అని బండి సంజయ్ కుమార్ హితవు పలికారు.

### భూ దందాను తెరపైకి తెస్తున్నారు..

"మహేశ్వరాన్ని ఫోర్త్ సిటీగా మారుస్తామనే సర్కార్ ప్రకటన వెనుక పెద్ద భూదందా నడుస్తోంది. కాంగ్రెస్ నేతలు వేల



ఎకరాలను అగ్గువకు కొని ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. బీఆర్ఎస్ మాదిరిగానే భూదందాతో వేల కోట్ల ఆస్తులను పోగేసుకునేందుకు ఫోర్త్ సిటీ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. దీనివల్ల కాంగ్రెస్ నేతలకు తప్ప ప్రజలకు పెద్దగా ప్రయోజనం లేదు... పెద్దఎత్తున ఆస్తులు సంపాదించేందుకు భూ దందాను తెరపైకి తేవడమే కాకుండా మహేశ్వరం కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకుడికే భూములను సేకరించే బాధ్యతను అప్పగించారు. రుణ మాఫీ... ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారు" అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

### రైతులు అల్లాడుతున్నారు..

"లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల సంఖ్య గత ప్రభుత్వ హయాంలోనే 36 లక్షల మంది ఉంటే... లక్షన్నర లోపు రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య 18 లక్షలు దాటకపోవడం విడ్డూరం. అంటే నూటికి 70 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. ఒకవైపు బ్యాంకుల్లో వడ్డీలు పెరిగి, బయట చేసిన అప్పులు తీరక, పెట్టుబడికి పైసల్లేక రైతులు అల్లాడుతుంటే ఈ ప్రభుత్వం మాత్రం గొప్పలు చెబుతోంది. రుణమాఫీతో పాటు 6 గ్యారంటీలను అమలు చేయకుండా దాటవేసేందుకు కాంగ్రెస్ నేతలకు ఏదో ఒక కొత్త అంశాన్ని తెరపైకి తీసుకురావడం, ప్రజల దృష్టిని మళ్లించడం అలవాటు అయిపోయింది. రాబోయే స్థానిక సంస్థల్లో గెలిచేందుకు రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందే తప్ప రైతులకు ఒరిగిందేమీ లేదు. రుణమాఫీతో సహా 6 గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సహా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బీజేపీ పోరుబాటకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కార్యచరణ సిద్ధం అవుతోంది" అని బండి సంజయ్ వెల్లడించారు.

### అసైన్డ్ భూములు ఎలా తగ్గాయి...?

"ధరణి పేరును భూమాతగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. భూమాతను భూ మేతకు ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి పేరుతో దేశంలోనే అతిపెద్ద స్కాం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 2014 నాటికి రాష్ట్రంలో 24 లక్షల అసైన్డ్ భూములుంటే నేడు ఆ భూములు ఐదు లక్షలకు ఎలా తగ్గాయి...? అసైన్డ్ భూములు, శిఖం భూములు, దేవాదయ, అటవీ, భూదాన భూములతోపాటు పేదల భూములను కూడా ధరణి పేరుతో బీఆర్ఎస్ నేతలు దండుకున్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వివరాలేవీ..? వాటిని ఎందుకని రేవంత్ సర్కారు బయట పెట్టడం లేదు...? ఆ భూముల విలువ రూ. 2 లక్షల కోట్ల రూపాయల వరకు ఉంటుందా..? అని కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని బండి సంజయ్ కోరారు

### ధరణి కమిటీ నివేదిక ఏది..?

"మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ధరణిని అడ్డుపెట్టుకుని దోచుకున్నారని ఎన్నికలకు ముందు చెప్పిన కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై ఎందుకు విచారణ జరిపించడం లేదు..? అధికారంలోకి రాగానే ధరణిపై ఐదుగురు సభ్యులతో వేసిన కమిటీ నివేదిక ఏది..? ధరణి పేరుతో దోపిడీ చేసిన దోషులెవరో ఎందుకు తేల్చడం లేదు..? ధరణిపై వేసిన కమిటీ బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ నేతలు ఏ విధంగా దోచుకోవాలా..? అనే అంశంపై రహస్య నివేదిక ఇచ్చినట్లుంది. అందుకే ఫోర్త్ సిటీ, భూమాత పేరుతో భూములను దోచుకునేందుకు కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతల తీరు చూస్తుంటే భవిష్యత్తులో గజం భూమి కూడా మిగిలే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ధరణి భూముల అన్యాక్రాంతంపై శ్వేత పత్రం విడుదల చేయాలి" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

### విలీన కుట్ర చేస్తున్నారు..

"గ్రేటర్ హైదరాబాద్ శివారులోని 33 గ్రామపంచాయతీలు, 20 పురపాలక సంఘాలు, 8 కార్పొరేషన్లు, 61 పారిశ్రామిక వాడలు, కంటోన్మెంట్ బోర్డు.. వీటన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదన అర్థం లేనిది. ప్రజలపై పన్నుల భారం మోపేందుకే విలీన కుట్ర చేస్తున్నారు. 15 ఏళ్ల క్రితం హైదరాబాద్ శివారులోని విలీనమైన ప్రాంతాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. వాటిని అభివృద్ధి చేయకుండా, కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలను విలీనం చేస్తామనడం అర్థం లేనిది. దీనిపై బీజేపీ నాయకత్వం చర్చించి తగిన కార్యాచరణను ప్రకటిస్తుంది" అని బండి సంజయ్ వెల్లడించారు.

# విద్య వైద్యకు ప్రభుత్వం పెద్ద పీట

-మొదటిపేజీ తరువాయి

ధరణిపై అబద్ధాలు చెపుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దరణిని ప్రక్షాళన చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా అతి కొద్ది రోజుల్లో 4 లక్షల 50 వేల ఇళ్లు కట్టబోతున్నామని తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదలకు అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చారని, గత ప్రభుత్వం తీసుకున్న భూములను పేదలకు పంచుతామని స్పష్టం చేశారు. ఏడు నెలలు పూర్తి కాకుండానే ఏం చేయలేదని ప్రతి పక్ష పార్టీ నాయకులు విమర్శిస్తున్నారని, గత ప్రభుత్వ పాలనలోనే ఆత్మహత్యలు జరిగాయని, కాంగ్రెస్ వచ్చింది కాబట్టే కరెంటు, నీళ్లు వచ్చాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారని, మంచి పరిపాలన కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నామని, ఆడబిడ్డలు, రైతన్నల ముఖాల్లో ఆనందం చూడలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

### ఎల్ఆర్ఎస్ అమలుకు వేగంగా అడుగులు..

కాగా లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) అమలుకు సంబంధించి అడుగులు వేగంగా పడుతున్నాయి. గత నాలుగేళ్లుగా లక్షల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు ప్రభుత్వం భావిస్తున్నట్లుగా మూడు నెలల్లో మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెండింగ్ దరఖాస్తుల సమస్య పరిష్కారంపై ఇరవై రోజుల వ్యవధిలోనే అటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్ష చేయడం, తాజాగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్లతో సమీక్ష నిర్వహించడాన్ని బట్టి ఈ అంశానికి



ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తుందన్నది స్పష్టం చేస్తోంది. మూడు నెలల్లోగా ఎల్ఆర్ఎస్ సమస్యకు పరిష్కారం చూపాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ దిశగా క్షేత్రస్థాయి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసింది.

### రూ.10 వేల కోట్ల ఆదాయం..

ఈ ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వానికి తక్షణం ఆదాయం సమకూరే అవకాశం ఉంది. సుమారు రూ.10 వేల కోట్ల దాకా ఖజానాకు జమ అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఎలాంటి న్యాయపరమైన చిక్కుల్లేవని స్పష్టమైంది. సుప్రీంకోర్టు, హైకోర్టు నుంచి ఈ ప్రక్రియపై ఎలాంటి స్టేలు లేవని వెల్లడైంది. దీంతో ఈ అంశంపై కింది స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, ఈ ప్రక్రియతో సంబంధం ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన ప్రారంభించి.. నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా కార్యాచరణ చేపట్టాలని నిర్దేశించింది.

### నాలుగేళ్ల నిరీక్షణకు తెర..

ఎల్ఆర్ఎస్ పథకం కింద ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం నాటి ప్రభుత్వం 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 వరకు రెండు నెలలపాటు దరఖాస్తులను స్వీకరించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.70 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షల దరఖాస్తులు, జీహెచ్ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల నుంచి 6 లక్షల దరఖాస్తులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి 1.35 లక్షల దాకా దరఖాస్తులు అందాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 131 ప్రకారం ప్లాట్ యజమాని వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకుంటే రూ.1000 ఫీజు చెల్లించాలని, లేఅవుట్ డెవలపర్ దరఖాస్తు చేస్తే (ఎన్ని ప్లాట్లు ఉన్నా) రూ.10 వేలు ఫీజుగా చెల్లించాలని నిర్ణయించింది. అయితే దీనిని సవాలు చేస్తూ జువ్వాడి సాగర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై హైకోర్టు నుంచి గానీ, సుప్రీంకోర్టు నుంచి గానీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ప్రభుత్వానికి రాకపోవడంతో పురపాలక శాఖ 2023 మే 20న (లెటర్ నంబరు 14148/పీఎల్జీ.111/2020) ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సూచించింది.

# పెట్టుబడులే లక్ష్యంగా..

-మొదటిపేజీ తరువాయి

ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించనున్నారు. ఆదివారం మంత్రి శ్రీధర్ బాబు అమెరికా బయలుదేరివెళ్లగా సోమవారం మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి యూఎస్ వెళ్లబోతున్నారు. వీరిద్దరు సీఎం బృందంతో కలుస్తారు. ఈ పర్యటనలో పలు కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకోనుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పెట్టుబడుల కోసం రేవంత్‌రెడ్డి విదేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి.

### న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో పర్యటన

ఈ నెల తొమ్మిది వరకు న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కో నగరాల్లో పర్యటించి పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం రేవంత్ భేటీ అవుతారు. అమెరికాలోని ప్రవాస భారతీయులతోనూ సమావేశమవుతారు. ఈ నెల 5న న్యూయార్క్‌లోని కాగ్నిజెంట్, ఆర్సీఎం, టిబిసి, కార్నింగ్, జోయిటస్ సహా పలు సంస్థల ప్రతినిధులతో సీఎం రేవంత్ భేటీ అవుతారు. 6న పెప్సికో, హెచ్‌సిఏ ఉన్నతాధికారులతో సమావేశమైన తరువాత న్యూయార్క్ నుంచి వాషింగ్టన్ వెళతారు. వాషింగ్టన్‌లో ఐటీ సేవల సంస్థలు నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. ఇక్కడ ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమవుతారు. అనంతరం డల్లాస్‌కు వెళ్తారు. ఈ నెల 7న ఛార్లెస్ స్క్వాబ్ హెడ్, మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను సందర్శిస్తారు. 8న కాలిఫోర్నియాలో ట్రినెట్ సీఈఓ, ఆరమ్, ఆమ్జెన్, రెనెసాస్, అమాట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతారు. సెలెక్ట్ టెక్ యూనికారన్స్ ప్రతినిధులతో మాట్లాడతారు. సెమీ కండక్టర్ రంగానికి చెందిన పలు సంస్థలతో రౌండ్ టేబుల్ భేటీలోనూ సీఎం రేవంత్ పాల్గొంటారు. ఈ నెల 9న గూగుల్ సీనియర్ ప్రతినిధులతో సిఎం రేవంత్ భేటీ ఉండనుంది. స్టాన్ ఫోర్డ్ బయోడిజైన్ సెంటర్‌ను సీఎం రేవంత్ సందర్శిస్తారు. అమెజాన్ వైస్ ప్రెసిడెంట్, జెడ్ స్కేలర్ సీఈఓ, ఎనోవిక్స్, మోనార్క్ ట్రాక్టర్స్, థెర్మోఫిషర్ సైంటిఫిక్ ప్రతినిధులను సీఎం రేవంత్ కలుస్తారు. ఈ నెల 10న అమెరికా నుంచి



బయలుదేరి 11న దక్షిణ కొరియా సియోల్‌కు చేరుకుంటారు. 12న సియోల్‌లో యూయూ ఫార్మా, కొరియన్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ, ఎల్ఎస్ హోల్డింగ్స్, హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులు సహా ఆ దేశ ఉన్నతాధికారులతో భేటీ అవుతారు. 13న హాన్ రివర్ ప్రాజెక్టుపై డిప్యూటీ మేయర్ జూ యంగ్ టాయ్తోతో సీఎం భేటీ ఉంటుంది. 14న రేవంత్ బృందం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతుంది. దక్షిణ కొరియా పర్యటనలో సామ్‌సంగ్, ఎల్జీ సంస్థల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరపనుంది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణలో రేవంత్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. పార్టీలకతీతంగా తెలంగాణ అభివృద్ధి ముఖ్యమన్నారు కేటీఆర్.

## నాకు, బీఆర్ఎస్ పార్టీకి 'తెలంగాణ ఫస్ట్'

-మొదటిపేజీ తరువాయి



తన ట్వీట్‌ను మొదలుపెట్టారు. 'పదేళ్లపాటు అధికారంలో ఉన్న తాము విదేశాల్లోని ప్రముఖ కంపెనీలతో పెంచుకున్న సంబంధాలు ఇప్పుడు రాష్ట్రానికి మేలు చేకూరుస్తున్నాయి. అలుపన్నది లేకుండా పట్టుదలతో రాష్ట్రానికి భారీ ఎత్తున విదేశీ పెట్టుబడులను తీసుకొచ్చాం. వాటిని చూసి ఇవాళ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు రానుండటం సంతోషకరం. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు మేం ప్రాధాన్యం ఇచ్చాం.' అని కేటీఆర్ పేర్కొన్నారు. టీఎస్ ఐపాస్‌లో ప్రభుత్వ వినూత్నమైన విధానాలకు ఆకర్షితులై చాలా సంస్థలు రాష్ట్రంలో గణనీయంగా పెట్టుబడులు పెట్టాయి. గడిచిన దశాబ్దకాలంలో రూ.4 లక్షల కోట్లకు పైగా ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను సృష్టించాం. రాజకీయాలు పక్కన పెడితే నాకు, బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ఫస్ట్. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యక్ష పెట్టుబడులు తేవడంలో విజయం సాధించాలని, తాము స్థాపించిన బలమైన పునాదిపై తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని హృదయపూర్వకంగా ఆశిస్తున్నా.. జై తెలంగాణ.' అని పోస్ట్ చేశారు.

## నల్గొండ బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చేయండి: మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

**అమెరికాకు వెళ్లి తిరిగి వచ్చే లోగా కూల్చేయాలని అధికారులకు ఆదేశం**

**అనుమతులు లేకుండా నిర్మించారన్న మంత్రి**

**వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనన్న మంత్రి కోమటిరెడ్డి**


అమెరికాకు వెళ్తున్నాను... ఆగస్ట్ 11న తిరిగి వస్తాను... ఈలోగా అనుమతిలేని నల్గొండ బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం నల్గొండ కౌన్సిల్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక బీఆర్ఎస్ ఆఫీస్‌ను కూల్చివేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌ను పిలిచి బీఆర్ఎస్ ఆఫీసు కూల్చివేత ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. అమెరికా వెళ్లి తిరిగి 11న వస్తానని... ఆ లోపు ఈ తంతు పూర్తి చేయాలన్నారు. అనుమతులు లేకుండా పార్టీ ఆఫీస్ నిర్మాణం చేపట్టారని, కాబట్టి తొలగించాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు.

### ఎన్నికల్లో పోటీపై కోమటిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్య

వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని... ఆరోగ్యం సహకరించకపోవచ్చునని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో ఉన్నా, లేకున్నా ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానన్నారు. నల్గొండ జిల్లా గుండ్లపల్లిలో డీ-37 కెనాల్‌కు శనివారం నీటిని విడుదల చేశారు. అనంతరం గ్రామానికి చెందిన రాజేంద్రప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో విరామం తీసుకుని భోజనం చేశారు. ఆ తర్వాత ముఖ్య అనుచరులు, సన్నిహితులతో ముచ్చటించారు. శ్రీశైలం సొరంగం, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పూర్తి చేయడం తన చిరకాల ఆకాంక్ష అన్నారు.

## తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్తు ఉంది

-మొదటిపేజీ తరువాయి



తీసుకున్న పోరాటాలపై ఆరా తీశారు. పార్టీ బలహీనంగా ఉన్న చోట మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలపై పోరాటం చేయాలని అన్నారు. ప్రజలకు అండగా ఉండాలని చెప్పారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో గోషమహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో బీఎల్ సంతోష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలపై చర్చించారు. జాతీయ నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పార్టీ పరిస్థితిపై ముఖ్య నేతలతో బీఎల్ సంతోష్ మాట్లాడారు.

### 6న ఆఫీస్ బేరర్స్ మీటింగ్

బీజేపీ పదాధికారుల సమావేశం ఈనెల 6న కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. తాజా రాజకీయాలు, రుణమాఫీ, నిరుద్యోగుల సమస్యలు, మహిళా సమస్యలపై పదాధికారులు చర్చించనున్నారు. ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొననున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బీజేపీ ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ఘనంగా చేయనున్నారు. ఈ వేడుక కోసం బీజేపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఉప్పల్ ఫ్లై ఓవర్ విషయంలో కేసీఆర్ సిగ్గుపడాలి

**హైదరాబాద్:** ఉప్పల్ ఫ్లైఓవర్‌ను 6 ఏళ్లు అయిన పూర్తి చేయకపోవడం ప్రజలకు అవమానకరమని తెలంగాణ రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండి హైదరాబాద్ విశ్వనగరం చేస్తున్నామని అన్నారని.. కానీ 6 ఏళ్లు అయిన ఉప్పల్ ఫ్లైఓవర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఉప్పల్, నారపల్లి ఫ్లై ఓవర్ పనులు 6 ఏళ్ల నుంచి 6 కిలోమీటర్లు గత ప్రభుత్వం పూర్తి చేయలేక పోయిందని మండిపడ్డారు. పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉప్పల్ రింగ్ రోడ్డులో నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. వరంగల్, భువనగిరి నుండి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ ఫ్లై ఓవర్ పనులు పూర్తి కాకపోవడంతో అధికారులపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. రూ. 600 కోట్లతో 2018లో పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. 6 ఏళ్లు అవుతున్న 6 కిలో మీటర్ల పనులు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నారపల్లిలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏడో తేదీ నుంచి పనులు ప్రారంభిస్తామని చెప్పిన నేషనల్ హైవే ఆర్వో పుష్ప తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సిగ్గుపడాలని అన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్‌పై గతంలో రేవంత్ రెడ్డి పార్లమెంట్‌లో 10 సార్లు అడిగారని గుర్తుచేశారు. మళ్లీ ఉప్పల్ ఫ్లైఓవర్ టెండర్ పిలుస్తామని ప్రకటించారు. ఫ్లైఓవర్ పూర్తి చేయడానికి మరో రూ. 2, 3 వందల కోట్ల రూపాయలు పెరుగుతుందని అన్నారు. 10 రోజుల్లో ఉప్పల్ చౌరస్తా నుంచి ఘట్‌కేసర్ %టా==% వరకు రోడ్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఫ్లైఓవర్ పనులు దసరా నాటికీ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. 18 నెలల్లో పూర్తి చేస్తామని వివరించారు. కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని విమర్శించారు. ఉప్పల్ ఫ్లైఓవర్‌ను గాలికి వదిలేశారని విమర్శించారు. డిసెంబర్‌లో మూసీ పనులు మొదలు పెడతామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంత్రి పదవి కోసం బీఆర్ఎస్2లోకి వెళ్లారని చెప్పారు. నవంబర్ ఒకటో తేదీ అంబర్ పేట ఫ్లైఓవర్ ప్రారంభిస్తామన్నారు. 3 నెలల్లో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి 6 లైన్ల రోడ్ పూర్తి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

### అధికారులపై మంత్రి కోమటిరెడ్డి సీరియస్

అధికారులపై మంత్రి కోమటిరెడ్డి సీరియస్ అయ్యారు. ఆరేళ్లయిన 6 కిలోమీటర్ల ఫ్లైఓవర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ ఒక సంవత్సరం చేయకపోతే... రెండో సంవత్సరం ఎందుకు కాంట్రాక్టు రద్దు చేయలేదని నిలదీశారు. ఆరేళ్లు ఎందుకు ఆగారని అడిగారు.

# టార్గెట్ బాలినేని...

**ఒంగోలు :** ఒంగోలులో రాజకీయం హైటెన్షన్‌గా మారింది? కొత్త ప్రభుత్వం కొలువుదీరిన రెండు నెలల్లోనే ఇంతలా పొలిటికల్ హీట్ పెరగడానికి కారణమేంటి? ఒంగోలు రాజకీయాల్లో ఏం జరుగుతోంది.రాష్ట్రంలో హైటెన్షన్ నియోజకవర్గాల్లో ఒంగోలు ఒకటి?. ఇక్కడ ఎప్పుడూ రాజకీయాలు వాడివేడిగా ఉంటాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మధ్య రాజకీయం మండే అగ్నిపర్వతాన్ని తలపిస్తుంది. నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్లు ఈ ఇద్దరు ఎప్పుడూ యుద్ధానికి సిద్ధమన్నట్లే దూకుడుగా వ్యవహరిస్తుంటారు. ఎన్నికల సమయంలో సహజంగా ఉండే ఈ హైటెన్షన్? ఎన్నికల ఫలితాలు విడుదలైన రెండు నెలల తర్వాత కొనసాగుతుండటమే హీట్ పుట్టిస్తోంది.ఒంగోలు ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత ఘోరంగా ఓడిపోయారు. గత ప్రభుత్వంలో మూడేళ్లపాటు మంత్రిగా పనిచేసిన బాలినేని?. మంత్రి పదవి పోయిన తర్వాత సొంత పార్టీపై కొంత అసంతృప్తితో ఉండేవారు. తన నియోజకవర్గ అభివృద్ధి కోసమంటూ నిత్యం అలకపాన్పు ఎక్కి? తనకు కావాల్సినవి సాధించుకునే వారు. ఇదే సమయంలో మంత్రి పదవి లేకపోయినా?. జిల్లాలో తనకు ఎదురు లేనట్లే రాజకీయం నడిపే వారు బాలినేని? వైసీపీ అధినేత జగన్‌తో దగ్గరి బంధుత్వం ఉండటంతో జిల్లాలో బాలినేనికి ఎదురు చెప్పే వారు లేకపోయే



వారు.దీంతో ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి, వియ్యంకుడు కుండా భాస్కర్‌రెడ్డిపై పలు భూ ఆక్రమణల ఆరోపణలు వచ్చాయి. వీరి కుటుంబానికి చెందిన శ్రీకర విల్లాస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థపైనా చాలా ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. అయితే గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో బాలినేనిని ఎవరూ టచ్ చేయలేకపోయారు. ఐతే ఇప్పుడు వైసీపీ ఓటమి తర్వాత బాలినేని టార్గెట్‌గా పావులు కదుపుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్? బాలినేని చుట్టూ ఉచ్చుబిగించేలా అడుగులు వేస్తున్నారు.బాలినేనిని రాజకీయంగా ఒంటరి చేయాలనే ఎత్తుగడతో ఒంగోలు కార్పొరేషన్‌పై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే జనార్దన్ పలువురు కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకున్నారు. ఇక బాలినేని అనుచరుడు.. గత ప్రభుత్వంలో బాలినేని బాధితుడైన సుబ్బారావు గుప్తాను తెరపైకి తెచ్చి? బాలినేని హయాంలో జరిగిన అక్రమాలన్నీ తవ్వితీస్తున్నారు. అంతేకాకుండా ఒకప్పుడు ఒంగోలులో ఎదురే లేదన్నట్లు హవా నడిపిన బాలినేనిని సవాల్ చేస్తూ పోస్టర్లు వేస్తుండటం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది.గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల పంపిణీతోపాటు ల్యాండ్, శాండ్ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విచారణ జరిపిస్తోంది ప్రభుత్వం. ఈ అంశాల్లో బాలినేనితోపాటు ఆయన కుమారుడు, వియ్యంకుడు పేర్లు బయటకు వస్తున్నాయంటున్నారు. అదే సమయంలో గతంలో టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసిన వారిని తాజాగా గుర్తిస్తూ అరెస్టు చేయిస్తుండటంతో వైసీపీ కార్యకర్తలు టెన్షన్ పడుతున్నారు.ఎన్నికల ముందువరకు ఒంగోలులో చక్రం తిప్పిన బాలినేని? ఫలితాలు విడుదలైన తర్వాత ఎక్కువగా హైదరాబాద్‌లోనే గడుపుతున్నారు. ఈ మధ్య ఒకసారి ఒంగోలు వచ్చిన బాలినేని మళ్లీ రెండు నెలల తర్వాత వస్తానని చెప్పి వెళ్లిపోయారు. మరోవైపు బాలినేని, ఆయన అనుచరులు టార్గెట్‌గా ఎమ్మెల్యే దామచర్ల వెంటాడుతుండటంతో వైసీపీ శ్రేణులు బిక్కుబిక్కుమంటున్నాయి. ఇటు కేసులు? అటు విచారణలతో వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దామచర్ల?. బాలినేని? ఆయన కుమారుడు, వియ్యంకుడే టార్గెట్‌గా పావులు కదుపుతుండటం రాజకీయంగా ఇంట్రెస్టింగ్ మారింది. అధికార పార్టీ విసురుతున్న సవాల్‌ను బాలినేని ఎలా అధిగమిస్తారనేది ఆసక్తి రేపుతోంది.

# పురోగతి లేని కంటైనర్ కేసు

**విశాఖపట్టణం :** సరిగ్గా ఎన్నికలకు ముందు అంటే దాదాపు 4 నెలల క్రితం విశాఖ తీరానికి భారీ మొత్తంలో డ్రగ్స్‌తో ఓ కంటైనర్ రావడం ఏపీవ్యాప్తంగా సంచలనం రేపింది. అదే డ్రగ్స్ ఇష్యూని ఎన్నికల ప్రధానాంశంగా మార్చుకున్న అప్పటి పాలక, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం మారింది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎన్డీయే.. అధికారంలోకి వచ్చినా కూడా దానిపై దర్యాప్తు చేపట్టలేదు. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా.. 4 నెలలుగా ఎలాంటి పురోగతి లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది.బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో మార్చి 16న కంటైనర్ విశాఖ పోర్టుకు చేరింది. దీనిపై ఇంటర్‌పోల్ సమాచారంతో ఆపరేషన్ గరుడ పేరుతో ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారులు కంటెయినర్‌ను తెరిచి బ్యాగ్‌లను పరిశీలించారు. మత్తు పదార్థాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఆ తర్వాత మార్చి 19న డ్రగ్స్ నమూనాలు సేకరించి సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి కంటెయినర్‌కు సీల్ వేశారు.విశాఖ డ్రగ్ కంటైనర్‌పై సీబీఐ దర్యాప్తు విషయాల్లో ప్రతిపక్ష వైసీపీ.. అనేక అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అయితే ఈ కంటైనర్ షిప్‌ను సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ.. బ్రెజిల్ నుంచి తీసుకొచ్చినట్లు సీబీఐ గుర్తించింది. దీంతో వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.తాజాగా ఈ కేసుపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రభుత్వంపై ఫైరయ్యారు. నాలుగు నెలలైనా కేసు దర్యాప్తు ముందుకు కదలడం లేదు ఎందుకు అని



ప్రశ్నించారు. ఈ కేసు ఫైల్ చేసినపుడు తమ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఆరోపణలు చేశారన్న ఆయన.. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి సర్కార్ విశాఖ డ్రగ్ కంటైనర్ ఘటనపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మరోవైపు కేసు విచారణ జరుగుతుందని.. సీబీఐ దగ్గర నుండి దర్యాప్తు వివరాలు తీసుకుని మీడియాకు వెల్లడిస్తానని హోం మంత్రి వంగలపూడి అనిత అంటున్నారు.సీజ్ చేసిన కంటెయినర్.. ఇంకా విశాఖలోని ఎగ్జామిన్ పాయింట్‌లోనే ఉంది. దీనికి సీఐఎస్‌ఎఫ్ భద్రత కల్పిస్తోంది. డీఆర్‌ఐ సీజ్ చేసిన 10 కంటెయినర్లు సైతం అక్కడే ఏడెనిమిదేళ్లుగా పడి ఉన్నాయి. బ్రెజిల్ నుండి కంటైనర్‌లో విశాఖకు డ్రగ్స్ వస్తున్నాయని ఇంటర్పోల్ నుండి సమాచారం తెలియడంతో విశాఖ, చెన్నై పోర్టులో హడావుడి చేసిన గత అధికారులు.. ఇప్పుడు దాని ఊసే ఎత్తకపోవడంతో ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. ఈ కేసు కూడా అలాగే మరుగున పడిపోతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## మోటర్లకు మీటర్లు...

**నిజామాబాద్ :** రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెడతారనే ప్రచారంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 2017లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉదయ్ పథకంలో భాగంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న నిబంధన పెట్టింది. ఇలా మీటర్లు పెట్టే రాష్ట్రాలకు సున్నా పాయింట్ ఐదుశాతం అదనంగా రుణాలిస్తామని కేంద్రం అప్పట్లోనే ప్రకటించింది. ఐతే అదనపు రుణాలను ఆశించిన రాష్ట్రాలు అప్పట్లోనే ఈ నిబంధనకు అంగీకరించినా, తెలంగాణలో మాత్రం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఇంతవరకు స్మార్ట్ మీటర్లు బిగించలేదు. కానీ, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు? గత సర్కార్ హయాంలోనే కేంద్రంతో రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకుందనే ప్రభుత్వ వాదన పరిశీలిస్తే త్వరలోనే రాష్ట్రంలోనూ వ్యవసాయ కనెక్షన్లకు మోటార్లు వస్తాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడమనే అంశాన్ని ఆయా రాష్ట్రాలకే వదిలేసింది కేంద్రం. ఐతే తెలంగాణలో మాత్రం వ్యవసాయేతర కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు రెడీ అయింది. దీనిపై కేంద్రంతో ఒప్పందం చేసుకున్నట్లు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కానీ, అధికారపక్షం వాదన దీనికి పూర్తి భిన్నంగా ఉంది. మోటార్లకు మీటర్లు పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమైందని ఆరోపిస్తూ సభలో సంబంధిత పత్రాలు చూపుతోంది ప్రభుత్వం? దీంతో ఏది నిజమో తెలియకపోయినా? మోటార్లకు మీటర్లు వస్తాయా? అనే భయం మాత్రం రైతుల్లో కనిపిస్తోందంటున్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017 జనవరి 4న కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ డిస్కంలు మీటర్ల ఏర్పాటుపై ఒప్పందం చేసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. అప్పటి అగ్రిమెంట్‌ను అసెంబ్లీలో చదివి వినిపించడంతోనే సందేహాలు మొదలయ్యాయి. 2017 జూన్ 30లోపు అన్ని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మీటర్లు, 2018 డిసెంబర్ 31లోపు 500 యూనిట్లకు పైగా విద్యుత్తును వినియోగించే వినియోగదారుల ఫీడర్ల వద్ద,2019 డిసెంబర్ 31లోపు 200 యూనిట్లకుపైగా వినియోగించుకునే వారి ఫీడర్ల వద్ద స్మార్ట్ మీటర్లు బిగిస్తామని ఇ ఒప్పందంలో ఉందని చెబుతున్నారు సీఎం.గృహ, వ్యవసాయ వినియోగ విద్యుత్తుకు నూటికి నూరు శాతం మీటర్లు బిగిస్తామని సుస్పష్టంగా ప్రధాని మోదీ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని దాచిపెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.ఐతే ప్రభుత్వ ఆరోపణలు కొట్టిపడేస్తున్న బీఆర్ఎస్?. మోటార్లకు మీటర్లు బిగిస్తే 30 వేల కోట్లు అదనంగా రుణమిస్తామని చెప్పినా, తాము వదులుకున్నామని అంటున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్ వాదనను తోసిపుచ్చుతోంది. బీఆర్ఎస్ చేసుకున్న ఒప్పందం రాష్ట్రానికి గుదిబండలా మారిందని ఆరోపిస్తున్నారు.మొత్తానికి సీఎం రేవంత్ రెడ్డి మాటలను పరిశీలిస్తే? రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయకతప్పదనే విషయమే స్పష్టమవుతోందంటున్నారు నిపుణులు. అదే జరిగితే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రైతులు వ్యవసాయ అవసరాలకు ఉచిత విద్యుత్తు పొందుతున్నారు. అదే స్మార్ట్ మీటర్లు పెడితే ప్రతి నెల రైతులు ఎంత విద్యుత్తు వినియోగించుకున్నారో లెక్కలు తీస్తారు. ఆ తరువాత మెల్లమెల్లగా విద్యుత్ బిల్లులు వసూలు చేసే ప్రమాదం పొంచి ఉందన్న చర్చ జరుగుతోంది.

## నోటికి తాళం....

**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు కామ్ అయిపోయారు. ఆయన ఏదో ఆశించి తన పెదవులకు తాళం వేసుకున్నట్లు తెలుస్తోంది. రానున్న రాజ్యసభ పదవిపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. అందుకే ఆయన ఇటీవల కాలంలో మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశంసించడం లేదు. అలాగని సొంత పార్టీ నేతలను ఎవరినీ విమర్శించడం లేదు. ఎందుకంటే కె.కేశవరావు తన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా ఆమోదం పొంది ఎన్నికలు జరిగితే తనకు అవకాశం దక్కుతుందన్న ఆశ ఆయనలో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.వీహెచ్ అధికారంలో ఉన్నా లేకపోయినా విమర్శలను మాత్రం వదిలిపెట్టరు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం పెట్టి మరీ ఆయన సొంత పార్టీనేతలపైనే విరుచుకుపడుతారు. అందుకు తరతమ బేధం లేదు. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన పార్టీలో అసంతృప్తిగానే ముద్రపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు ఆయన ఆత్మగా చెప్పుకునే కేవీపీపై కూడా అప్పట్లో విమర్శలు చేసి వార్తల్లోకి ఎక్కారు. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ పీసీసీ చీఫ్‌ల అందరిపైనా ఆయన విమర్శలు చేశారు. టిక్కెట్ల కేటాయింపు సమయంలో ఇక వేరే చెప్పాల్సిన పనిలేదు. తన అడ్డా అయిన అంబర్ పేట్ నియోజకవర్గంలో తన అనుచరుడికి టిక్కెట్ రాకుండా అడ్డుకున్నారని మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డిపైన కూడా విమర్శలు చేశారు.. తనకు ఖమ్మం పార్లమెంటు టిక్కెట్ కావాలని యాగీ యాగీ చేశారు. అయితే అధినాయకత్వం మాత్రం ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో పార్టీలో పెద్దాయనకు తన పరిస్థితి అర్థమయినట్లుంది. తన నోరే తనకు చేటు తెస్తుందని గ్రహించినట్లుంది. కొన్నాళ్లుగా ఆయన మౌనంగా ఉండటానికి కారణం తనకు ఏదో ఒక పదవి వస్తుందన్న నమ్మకమే. గాంధీ కుటుంబానికి వీర విధేయుడిగా వి.హనుమంతరావుకు పేరు. అలాగే బీసీ కార్డుతో ఆయన జనంలోకి బయలుదేరుతుంటారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎప్పటికీ గెలవనప్పటికీ పలుమార్లు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు.

# యూపీలో ప్రారంభమైన కులాల సమరం

**లక్నో :** లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కి ఊహించని దెబ్బకొట్టిన ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికార, విపక్ష కూటమి పార్టీలు మరో రెండేళ్లలో రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నాయి. జరిగిన నష్టాన్ని పూడ్చుకుని మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందాలని కమలనాథులు భావిస్తుంటే.. లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే అసెంబ్లీ ఎన్నికల్లోనూ వివిధ సామాజికవర్గాలను ఆకట్టుకుంటూ కలసికట్టుగా కమలదళాన్ని ఓడించాలని విపక్ష కూటమి పార్టీలు సమాజ్‌వాదీ కాంగ్రెస్ భావిస్తున్నాయి. ఈ క్రమంలో వివిధ వర్గాల ప్రజలను ఆకట్టుకునేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేసే ప్రయత్నాల్లో రెండు కూటములు మునిగి తేలాయి. రాజకీయ చదరంగంలో ఒకరికొకరు 'చెక్ మేట్' పెట్టేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ విషయానికొస్తే.. యాదవులు మినహా ఇతర ఓబీసీ సామాజికవర్గాలు, అగ్రవర్ణాలు, దళిత వర్గాల్లో కొందరి అండతో వరుసగా విజయాలు సాధిస్తూ చ్చిన ఈ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఈ మూడు వర్గాలు దెబ్బకొట్టాయి. మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని విపక్షాలు చేసిన ప్రచారం ప్రభావంతో దళిత, ఓబీసీ వర్గాల్లో చాలా మంది దూరమవగా.. టికెట్ల కేటాయింపులో ఠాకూర్లకు తగిన ప్రాతినిథ్యం, ప్రాధాన్యత దక్కలేదన్న ఆక్రోశానికి తోడు.. తమ వర్గానికే చెందిన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను బీజేపీ అగ్రనాయకత్వం దూరం పెడుతోందన్న భావన ఆ వర్గం ఓటర్లలో నెలకొంది. ఫలితంగా వారంతా కలసికట్టుగా బీజేపీకి పూర్తి వ్యతిరేకంగా పనిచేశారు. తమ సంఖ్యాబలం పెద్దగా లేనప్పటికీ, రాష్ట్రంలో భూస్వామ్య సామాజికవర్గమైన ఠాకూర్లు? అనేక ఇతర వర్గాలను ప్రభావితం చేయగలరు. ఈ కారణాలు బీజేపీకి శరాఘాతంగా మారాయి. దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు (80) ఉన్న ఈ రాష్ట్రంలో కమలదళం గత ఎన్నికలతో పోల్చితే ఏకంగా 9.57 శాతం ఓట్లను కోల్పోయి 43.31% ఓట్లతో కేవలం 36 సీట్లను గెలుపొందగలిగింది. అదే సమయంలో విపక్ష కూటమి 19.05 శాతం ఓట్లను పెంచుకుని 43.52% ఓట్లతో 43 సీట్లను గెలుపొందింది. ఒక్క సీటులో ఈ రెండు కూటముల్లోనూ లేని ఆజాద్ సమాజ్ పార్టీఅధినేత చంద్రశేఖర్ ఆజాద్ గెలుపొందారు. అధికార, విపక్ష కూటముల మధ్య ఓట్ల శాతంలో పెద్ద తేడా లేనప్పటికీ బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ దాదాపు 10 శాతం ఓట్లను కోల్పోవడంతో సీట్ల సంఖ్యలో భారీగా కోత పడింది. ఈ ఎన్నికల ఫలితాలపై జాతీయ, రాష్ట్రస్థాయిలో అంతర్మథనం, ఆత్మపరిశీలన చేసుకున్న కమలదళం.. తమకు దూరమైన దళిత, ఓబీసీ వర్గాలను మళ్లీ దగ్గర చేసుకునే ప్రయత్నాలు చేస్తోంది. సమాజ్‌వాదీ పార్టీ తన రాజకీయ పునాదిని పిఛ్‌డా (వెనుకబడిన తరగతులు), దళిత్, అల్ప సంఖ్యాక్ (మైనారిటీ) వర్గాలకు మాత్రమే పరిమితం చేయకుండా, అగ్రవర్ణాల్లో గణనీయమైన సంఖ్యలో ఉన్న బ్రాహ్మణులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. తద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్ర అధికార పీఠంపై పాగా వేయాలని అఖిలేశ్ యాదవ్ భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆ పార్టీ శాసనసభాపక్ష నేతగా బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాతా ప్రసాద్ పాండేను నియమించారు. నిజానికి ఈ బాధ్యతను తమ కుటుంబానికి చెందిన శివపాల్ యాదవ్ లేదా పార్టీలో సీనియర్లుగా ఉన్న ఇంద్రజిత్ సరోజ్, రామ్ అచల్ రాజ్‌భర్ తూఫానీ సరోజ్ వంటి ఓబీసీ నేతల్లో ఒకరిని నియమిస్తారని అందరూ భావించారు. కానీ అందరి ఊహలు, అంచనాలను తలకిందులు చేస్తూ అఖిలేశ్ యాదవ్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.బీజేపీకి బలమైన ఓటుబ్యాంకుగా నిలిచిన ఓబీసీల్లో విశ్వాసం కల్గిస్తూ.. దళితవర్గాలను ఆకట్టుకోవడంపై బీజేపీ దృష్టి సారించింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత యూపీలో పార్టీలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో నియమితులైన వారిలో ఓబీసీ, దళిత వర్గాలకు చెందిన నేతలకు అగ్రభాగం దక్కింది. మోడీ ప్రభుత్వం శనివారం కొత్తగా ఆరుగురు గవర్నర్లను నియమించింది. వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు నేతలున్నారు. ఒకరు సంతోష్ కుమార్ గంగ్వార్ కాగా, మరొకరు లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య. సంతోష్ కుమార్ గంగ్వార్‌ను జార్ఖండ్ గవర్నర్‌గా నియమించగా, లక్ష్మణ్ ఆచార్యను అస్సాం గవర్నర్‌గా నియమిస్తూ.. మణిపూర్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గవర్నర్ నియామకానికి ముందు, స్వామి ప్రసాద్ మౌర్య రాజీనామాతో ఖాళీ అయిన శాసన మండలి స్థానానికి మౌర్య సామాజిక వర్గానికి చెందిన బహోరన్ లాల్ మౌర్యను బీజేపీ ఎమ్మెల్సీగా చేసింది. సంతోష్ కుమార్ గంగ్వార్ మరియు బహోరన్ లాల్ మౌర్య ఇద్దరూ ఓబీసీ వర్గాలకు చెందిన నేతలే. ఇకపోతే లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య దళిత వర్గానికి చెందిన నేత.ఓబీసీ ఓట్ల ఆధారంగానే ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ తన రాజకీయ అజ్ఞాతవాసాన్ని ముగించింది 2014 నుంచి వరుసగా విజయాలు సాధిస్తూ వచ్చింది. 2014 ఎన్నికల్లో యాదవేతర ఓబీసీలు, జాతవేతర దళితులపై దృష్టి సారించి బలమైన సోషల్ ఇంజనీరింగ్ చేసింది. అప్పటి వరకు ఓబీసీల పేరుతో యాదవులకు మాత్రమే ప్రాధాన్యత దక్కగా, దళిత రాజకీయాల్లో 'జాతవ్' వర్గానికి చెందిన దళితులకు మాత్రమే ప్రాధాన్యత దక్కింది. బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ ఫలితంగా ఈ రెండు వర్గాల్లో మిగతా సామాజికవర్గాలు కమలదళం వెంట నడిచాయి. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో సమాజ్‌వాదీ పార్టీ ఖఆం (ఓబీసీ, దళిత, మైనారిటీ) ఫార్ములా కారణంగా బీజేపీ సోషల్ ఇంజనీరింగ్ ఫలించలేదు. యాదవులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారన్న ముద్రను చెరిపి వేయాలన్న సంకల్పంతో అఖిలేశ్ యాదవ్ తన కుటుంబానికి చెందిన 5 గురు యాదవులకు తప్ప మరెవరికీ టికెట్ ఇవ్వకుండా ఇతర ఓబీసీ వర్గాలకు టికెట్లు కేటాయించారు. ఫలితంగా కుర్మీ, కొయేరీ, నిషాద్ వంటి ఓబీసీ కులాలు ఈసారి సమాజ్‌వాదీ పక్షాన నిలిచాయి.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 56 శాతం జనాభా ఉన్న ఓబీసీలు రాజకీయంగా నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. అందుకే అన్ని పార్టీలు ఈ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఓబీసీ కులాల ఓటింగ్ సరళిని పరిశీలిస్తే, బీజేపీ, దాని మిత్రపక్షాల ఓట్ల శాతం తగ్గుముఖం పట్టగా, ఎస్పీ, కాంగ్రెస్ కూటమికి లబ్ధి చేకూరింది. ఓబీసీ ఓట్లు జారిపోవడంతో యూపీలో బీజేపీ సీట్లు 2019తో పోలిస్తే 29 సీట్లు తగ్గాయి. ఈ సీట్ల సంఖ్యతో బీజేపీ మెజారిటీకి దూరంగా ఉండి మిత్రపక్షాల సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చిందిలోక్‌సభ ఎన్నికల ఫలితాలు మిగిల్చిన చేదు అనుభవం నుంచి తేరుకున్న కమలదళం 2027 అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. తన రాజకీయ సమీకరణాలను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో జరిగే అన్ని నియామకాల్లోనూ ఓబీసీలకే పట్టం కడుతున్నారు. ఓబీసీలను తమకు అనుకూలంగా మలచుకునేందుకు బీజేపీ కింది స్థాయి నుంచి కసరత్తు ప్రారంభించింది. జూలై 29న లక్నోలో బీజేపీ ఓబీసీ విభాగం సమావేశం నిర్వహించింది. ఇందులో సీఎం యోగి ఆదిత్యనాథ్, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు లోక్‌సభ ఎన్నికల నాటికి ఏర్పడిన రాజకీయ వాతావరణాన్ని 2027 వరకు కొనసాగించడమే కాకుండా 2024లో వచ్చిన ఓట్ల శాతాన్ని మరింత పెంచుకునేందుకు ఎస్పీ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకుగా భావించే బ్రాహ్మణ వర్గాన్ని తమవైపు తిప్పుకోవడం కోసం మాతా ప్రసాద్ పాండేను శాసనసభా పక్ష నేతగా నియమించింది. మాతా ప్రసాద్ పాండే యూపీలోని పూర్వాంచల్ ప్రాంతం నుండి వచ్చారు. ఇక్కడ ఠాకూర్లు, బ్రాహ్మణుల మధ్య రాజకీయంగా ఆధిపత్య పోరు ఉంది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఠాకూర్ సామాజికవర్గం నుంచి ఉండడంతో, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన మాతా ప్రసాద్ పాండేను సమాజ్‌వాదీ పార్టీ వ్యూహాత్మకంగా అసెంబ్లీ ప్రతిపక్ష నేతను చేసింది. యూపీలో దాదాపు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు ఉన్నారు. వారిలో వీలైనంత ఓటుబ్యాంకును తమవైపు తిప్పుకోవాలని ఎస్పీ చూస్తోంది. పీడీఏ ఫార్ములా గురించి మాట్లాడుతున్నప్పటికీ, తాము బ్రాహ్మణులకు వ్యతిరేకం కాదని, కీలక పదవులు ఇవ్వడంలో వెనుకాడమని సంకేతమిస్తూ మాతా ప్రసాద్ పాండేను ప్రతిపక్ష నేత పదవికి ఎంపిక చేసింది. దీని వెనుక అఖిలేష్ మరో వ్యూహం ఏంటంటే.. ఎస్పీ ఎమ్మెల్యేలు మనోజ్ పాండే, రాకేష్ పాండే, వినోద్ చతుర్వేది బీజేపీ వైపు మొగ్గు చూపడంతో ఎస్పీలో తమ ప్రాధాన్యత తగ్గుతోందన్న భావన బ్రాహ్మణ వర్గానికి అందింది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో బ్రాహ్మణ సమాజానికి ఓ సందేశం ఇస్తూ తమవైపు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా రెండు పక్షాలు తమ ఓటుబ్యాంకును కాపాడుకుంటూ ప్రత్యర్థి ఓటుబ్యాంకును చీల్చి తమవైపు ఆకట్టుకునే ప్రయత్నాల్లో మునిగితేలుతున్నాయి.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vnteludaily@gmail.com, vaasthavanestham.com